

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 24-01-2026 | సంపుటి - 26 | సంచిక -245 | రూ : 4 | పేజీలు: 8


## మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం

# రూ.3.70 కోట్లు విడుదల

- నిధులు విడుదల చేసిన పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన మంత్రిత్వ శాఖలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో నిధులు విడుదల
- గతంలో రూ.80 కోట్లతో పర్యాటకులకు మౌలిక సదుపాయాలు



2లో




2లో

## కేరళలో కొత్త రైళ్లకు

# ప్రధాని మోదీ పచ్చజెండా..

- కేరళలో మూడు అమృత్ భారత్, ఒక ప్యాసింజర్ రైలును ప్రారంభించిన ప్రధాని
- తిరువనంతపురం నుంచి తెలంగాణలోని చర్లపల్లికి కొత్త అమృత్ భారత్ సర్వీసు
- నాన్-ఏసీ కోచ్‌లలోనూ సీసీటీవీ, చార్జింగ్ సాకెట్ల వంటి మెరుగైన సౌకర్యాలు
- సామాన్యులకు తక్కువ ధరలో సౌకర్యవంతమైన ప్రయాణం లక్ష్యంగా ఈ రైళ్లు
- ఈ కొత్త రైళ్ల నిర్వహణ బాధ్యతలను చూడనున్న దక్షిణ రైల్వే



2లో

శ్రీవారికి భారీ విరాళాలు..

## ఒకే రోజు కోట్లలో కానుకలు

- పీఎల్ఆర్ కన్స్ట్రక్షన్స్ సంస్థ నుంచి రూ.2.50 కోట్ల విరాళం
- మంత్రి లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా రూ.44 లక్షలు విరాళం
- టీటీడీలోని వివిధ ట్రస్టులకు ఈ విరాళాలను కేటాయింపు

## ఎంత ఎదిగినా నా బిడ్డవే..

లోకేశ్‌కు తల్లి భువనేశ్వరి ఎమోషనల్ బర్త్‌డే విషెస్

- తల్లి నారా భువనేశ్వరి నుంచి ప్రత్యేక శుభాకాంక్షలు
- ఎక్స్ వేదికగా భావోద్వేగ పోస్ట్ చేసిన భువనేశ్వరి
- మంత్రిగా లోకేశ్ పనితీరు సంతోషాన్నిస్తోందని వెల్లడి



2లో



2లో

## పుణేలో తీవ్ర విషాదం..

సైకిల్‌పై వెళుతుండగా కారు కింద పడి బాలుడు మృతి

- పుణేలోని లోనికల్భోర్ ప్రాంతంలోని రెసిడెన్షియల్ హౌసింగ్ సొసైటీలో దుర్ఘటన
- జాయ్‌నెస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రాంగణంలో కారు కిందపడి బాలుడి మృతి
- సీసీటీవీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు




2లో

## సైబర్ నేరాల బాధితులకు ఊరట

- న్యాయస్థానంతో సంబంధం లేకుండానే ఖాతాల్లో సొమ్ము తిరిగి జమ
- రూ.50 వేలలోపు చెల్లింపు ప్రక్రియ సులభతరం
- ఐ4సీ ప్రతిపాదనకు కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆమోదం

## మా వైపు నుంచి ప్రయత్నిస్తున్నాం..

# బ్యాంకర్లు కూడా సహకరించాలి

- దావోస్ పర్యటన ముగించుకుని నేరుగా ఎస్ఎల్బీసీ సమావేశానికి హాజరైన సీఎం
- టిడ్కో ఇళ్ల రుణాలకు సంబంధించి సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు
- ఎంఎస్ఎంఈలకు ఊతమిస్తేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని వెల్లడి
- డ్వాక్రా సంఘాల ఖాతాలపై విధిస్తున్న 15 రకాల ఛార్జీలను తగ్గించాలని సూచన
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు రూ.10 కోట్లు విరాళమిచ్చిన యూనియన్ బ్యాంక్

2లో



# మా వైపు నుంచి ప్రయత్నిస్తున్నాం... బ్యాంకర్లు కూడా సహకరించాలి

అమరావతి: "టిడ్కో ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల వేలాది మంది లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించి, పేదలకు అండగా నిలిచేందుకు మా ప్రభుత్వం తరఫున శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసే విషయంలో ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ క్రమంలో బ్యాంకర్లు కూడా ఉదారంగా వ్యవహరించి మాకు సహకరించాలి..." అని ముఖ్యమంత్రి చంద్రబాబు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడమే తమ లక్ష్యమని, ఇందుకు బ్యాంకులు పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కావాలని ఆయన ఆకాంక్షించారు. దావోస్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని శుక్రవారం రాష్ట్రానికి చేరుకున్న ముఖ్యమంత్రి, ఏమాత్రం విశ్రాంతి తీసుకోకుండా నేరుగా సచివాలయంలో జరిగిన 233, 234వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల (ఎస్ఎల్‌బీసీ) సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 202526 వార్షిక రుణ ప్రణాళిక అమలు, ఎంఎస్ఎంఈలు, వ్యవసాయ రుణాల తీరుతెన్నులపై సుదీర్ఘంగా సమీక్షించారు.

**ఎంఎస్ఎంఈలే ఆర్థిక ప్రగతికి ఇంజిన్లు**

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) బలోపేతం కావడం అత్యంత ఆవశ్యకమని సీఎం స్పష్టం చేశారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేరాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. "బలహీన వర్గాలకు చేయూతనిచ్చే ఎంఎస్ఎంఈలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వండి. వీటిని ప్రోత్సహిస్తే ప్రాథమిక రంగంతో పాటు పారిశ్రామిక, సేవా రంగాలు కూడా సమాంతరంగా అభివృద్ధి చెందుతాయి. పేద, ధనికుల మధ్య అంతరాలు తగ్గాలంటే బడుగు వర్గాలకు ఆర్థిక చేయూత అందాలి," అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు ఎంఎస్ఎంఈలకు రూ. 95,714 కోట్ల మేర రుణాలు జారీ చేసినట్లు బ్యాంకర్లు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు.

**నమ్మకమే పెట్టుబడి... బ్రాండింగే బలం**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని, విచ్చలవిడిగా అప్పులు తేవడం వల్ల వడ్డీ భారం పెరిగిందని సీఎం గుర్తు చేశారు. అయితే, ప్రస్తుతం తమ ప్రభుత్వంపై ఉన్న క్రెడిబిలిటీ కారణంగా తక్కువ వడ్డీలకే రుణాలు తెచ్చుకునే వెసులుబాటు కలిగిందన్నారు. "క్రెడిబిలిటీ, బ్రాండింగ్‌కు మేం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. రాష్ట్రంలో రూ.2 లక్షల కోట్ల మేర రుణాలను రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు రూ.49 వేల కోట్ల రుణాలను రీషెడ్యూల్ చేయడం ద్వారా రూ.1108 కోట్ల మేర ఆదా చేసుకోగలిగాం," అని సీఎం వివరించారు. ప్రజలకు భరోసా ఇచ్చేలా పాలన సాగుతోందని, బ్యాంకర్లు కూడా అదే నమ్మకంతో ముందుకెళ్లాలని సూచించారు.

**రైతులకు, డ్వాక్రా మహిళలకు దన్ను**

వ్యవసాయ రంగానికి సంబంధించి ఇప్పటివరకు రూ. 2.96 లక్షల కోట్ల రుణాలు ఇచ్చినట్లు బ్యాంకర్లు వెల్లడించారు. అయితే, కౌలు రైతులకు, ప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహం అందించాలని సీఎం కోరారు. "డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసిన విధంగానే, ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను (FPOs) తీర్చిదిద్దాలి. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానంతో ముందుకెళుతున్నాం. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లే పరిస్థితి రాకూడదు" అని సీఎం స్పష్టం చేశారు. అలాగే, డ్వాక్రా గ్రూపుల బ్యాంక్ ఖాతాలపై ప్రస్తుతం 15 రకాల ఛార్జీలు వేస్తున్నారని, వీటిని తగ్గించి మహిళలకు ఊరట కల్పించాలని బ్యాంకర్లను ఆదేశించారు.

**ఇన్నోవేషన్ హబ్‌కు బ్యాంకుల క్యూ**

రాష్ట్రంలో స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ఏర్పాటు చేస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు బ్యాంకులు పెద్ద ఎత్తున మద్దతు తెలపడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. అమరావతిలోని ప్రధాన హబ్‌కు యూనియన్ బ్యాంక్, రాజమండ్రికి ఎస్బీఐ, అనంతపురానికి కెనరా బ్యాంక్, విశాఖకు పంజాబ్ నేషనల్ బ్యాంక్, తిరుపతికి ఇండియన్ బ్యాంక్, విజయవాడకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు సహకారం అందిస్తున్నాయని బ్యాంకర్లు తెలిపారు. లీడ్ బ్యాంకుగా వ్యవహరిస్తున్న యూనియన్ బ్యాంక్, తన సీఎస్సార్ నిధుల నుంచి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు రూ. 10 కోట్లు విరాళం ప్రకటించింది. అమరావతిని ఫైనాన్స్ హబ్‌గా మార్చేందుకు బ్యాంకులు తమ కార్యాలయాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం కోరారు. భూ రికార్డుల ప్రక్షాళన, క్యూఆర్ కోడ్ ఆధారిత పట్టాదార్ పాస్ పుస్తకాల జారీ ప్రక్రియను వివరించిన సీఎం, బ్యాంకులు కూడా ఖాతాల నిర్వహణలో క్యూఆర్ కోడ్ విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఇకపై జరిగే ఎస్ఎల్బీసీ సమావేశాలకు జిల్లాల కలెక్టర్లను కూడా ఆహ్వానించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, సీఎస్ విజయానంద్, వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎంత ఎదిగినా నా బిడ్డవే..
## లోకేశ్‌కు తల్లి భువనేశ్వరి ఎమోషనల్ బర్త్‌డే విషెస్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఇవాళ తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రాజకీయ, సినీ రంగాల ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, తనయుడి పుట్టినరోజున తల్లి నారా భువనేశ్వరి సోషల్ మీడియా వేదికగా పంచుకున్న ప్రేమపూర్వక సందేశం అందరినీ ఆకట్టుకుంటోంది. 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా లోకేశ్‌కు భువనేశ్వరి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "కొడుకు ఎంత ఎదిగినా తల్లికి మాత్రం బిడ్డగానే కనిపిస్తాడు అంటారు. లోకేశ్‌ను చూస్తున్నప్పుడు కూడా నిన్న మొన్నటి వరకు నా చేతుల్లో ఆడుకున్న పిల్లాడేనా అనిపిస్తుంది. ఆ పిల్లాడే ఇప్పుడు మంత్రిగా బాగా పనిచేసి అందరి ప్రశంసలు అందుకుంటుంటే ఎంతో సంతోషంగా ఉంటుంది. నాన్నా లోకేశ్... నీకు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఇలాంటి మరెన్నో పుట్టిన రోజులను నువ్వు ఆనందంగా, ఆరోగ్యంగా జరుపుకోవాలని మనసారా ఆశీర్వదిస్తున్నాను" అని భువనేశ్వరి తన పోస్టులో పేర్కొన్నారు. తల్లిగా తన కుమారుడి ఎదుగుదలను చూసి భువనేశ్వరి పడుతున్న ఆనందం ఈ పోస్టులో స్పష్టంగా కనిపిస్తోందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

# సైబర్ నేరాల బాధితులకు ఊరట

హైదరాబాద్: కేంద్ర హోంమంత్రిత్వశాఖ తీసుకున్న నిర్ణయంతో తక్కువ మొత్తంలో సొమ్ము పోగొట్టుకున్న సైబర్ నేరాల బాధితులకు ఊరట కలగనుంది. రూ.50 వేలలోపు డబ్బు నష్టపోయినవారికి న్యాయస్థానంతో సంబంధం లేకుండానే తిరిగి చెల్లించాలన్న ప్రతిపాదనకు హోంమంత్రిత్వశాఖ ఆమోదం తెలపడమే ఇందుకు కారణం. నేరం జరిగిన వెంటనే ఫిర్యాదు చేసిన సందర్భాల్లో సదరు లావాదేవీని నిలిపివేస్తున్నప్పటికీ న్యాయపరమైన ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల బాధితులు తమ డబ్బు పొందేందుకు నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఈ ఆలస్యాన్ని తగ్గించి... వీలైనంత త్వరగా బాధితుల ఖాతాలో డబ్బు తిరిగి జమయ్యేలా చూసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే తాజా ప్రతిపాదనను హోంశాఖ ఆమోదించింది.

**90 రోజుల్లోపు...**

లోక్ అదాలత్ ద్వారా వీలైనంత త్వరగానే బాధితులకు డబ్బు తిరిగిచ్చే ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ప్రయోజనం ఉండటం లేదు. రాష్ట్రంలో గతేడాది సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు పోగొట్టుకున్న రూ.246 కోట్ల విలువైన లావాదేవీలను నిలిపివేశారు. ఇందులో నుంచి రూ.159.65 కోట్లు మాత్రమే 24,498 మంది బాధితులకు తిరిగి ఇవ్వగలిగారు. ఇంకా సుమారు రూ.87 కోట్లు బ్యాంకు ఖాతాల్లోనే ఉన్నాయి. చిన్న మొత్తాలు పోగొట్టుకున్న సందర్భాల్లోనూ బాగా ఆలస్యం అవుతుండటంతో బాధితులకు ఉపశమనం కలగడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రూ.50 వేలలోపు పోగొట్టుకున్న కేసుల్లో న్యాయస్థానంతో సంబంధం లేకుండా 90 రోజుల్లోపు నేరుగా బాధితుడి ఖాతాలోనే జమ అయ్యేలా చూడాలని ఐ4సీ అధికారులు చేసిన ప్రతిపాదనను కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆమోదించింది. త్వరలోనే ఇది అమలులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే ఇలాంటి లావాదేవీలపై ఎలాంటి న్యాయపరమైన అభ్యంతరాలు ఉండకూడదు. సైబర్ బాధితుల్లో సగానికిపైగా తక్కువ మొత్తం పోగొట్టుకుంటున్న వారే ఉంటున్నారు. కేంద్రం తాజా నిర్ణయంతో ఇటువంటి వారికి మేలు చేకూరనుంది.

**నేరం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తేనే...**

దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. మాయమాటలతో బురిడీ కొట్టిస్తున్న మోసగాళ్లు... అమాయకుల ఖాతాల్లో ఉన్నదంతా కొల్లగొడుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఒక బాధితుడు ఇటీవల ఏకంగా రూ.12 కోట్లు పోగొట్టుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇదే సమయంలో రూ.1015 వేలు పోగొట్టుకుంటున్నవారూ అనేక మంది ఉన్నారు. అల్పాదాయ వర్గాలవారికి రూ.10 వేలు కూడా ఎక్కువే. గతేడాది రాష్ట్రంలో సైబర్ నేరాలకు సంబంధించి మొత్తం 83,413 ఫిర్యాదులు రాగా... బాధితులు రూ.1,378 కోట్లు నష్టపోయారు. కొల్లగొట్టిన డబ్బును నేరగాళ్లు వేర్వేరు ఖాతాల్లోకి మళ్లించి డ్రా చేసుకోవడం లేదా క్రిప్టో కరెన్సీగా మార్చి విదేశాలకు మళ్లించడమో చేస్తున్నారు. ఇలా జరగకముందు ఫిర్యాదు చేస్తేనే లావాదేవీని స్తంభింపజేయడానికి ఆస్కారం ఉంటుంది. నేరం జరిగిన తర్వాత ఎంతసేపటికి ఫిర్యాదు చేశారన్నదానిపై ఇది ఆధారపడి ఉంటుంది. 1930కి బాధితులు వెంటనే ఫోన్ చేసి తమ బ్యాంకు ఖాతా వివరాలు ఇస్తే... అందులో నుంచి ఏయే ఖాతాల్లోకి డబ్బు మళ్లిందో గుర్తించి నిలిపివేస్తున్నారు. ఇందుకు ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

## శ్రీవారికి భారీ విరాళాలు..
## ఒకే రోజు కోట్లలో కానుకలు

తిరుమల: తిరుమల శ్రీవారికి మరోసారి భారీ విరాళాలు అందాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ, అలాగే ఓ విద్యాసంస్థల అధినేత వేర్వేరుగా స్వామివారికి కోట్లాది రూపాయలను కానుకగా సమర్పించారు. ఈ విరాళాలను టీటీడీ ఆధ్వర్యంలో నడిచే వివిధ సేవా ట్రస్టులకు కేటాయించారు. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్‌కు చెందిన పీఎల్‌రాజు కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ సంస్థ, టీటీడీ ట్రస్టులకు మొత్తం రూ. 2.50 కోట్లు విరాళంగా ఇచ్చింది. సంస్థ ప్రతినిధి రాజగోపాలరాజు, శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు. ఈ విరాళంలో శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు, విద్యాదాన ట్రస్టుకు చెరో రూ.75 లక్షలు ఉన్నాయి. అలాగే బర్డ్ ట్రస్టుకు రూ.50 లక్షలు, అన్నప్రసాదం, గో సంరక్షణ ట్రస్టులకు చెరో రూ.25 లక్షలు చొప్పున అందించినట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. పీఎల్‌రాజు కన్‌స్ట్రక్షన్స్ విరాళం అందించిన కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు. మరోవైపు మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజును పురస్కరించుకుని భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ భారీ విరాళం ప్రకటించారు. ఒకరోజు అన్నప్రసాద వితరణ కోసం ఆయన రూ. 44 లక్షలు అందించారు. నేడు మంత్రి లోకేశ్ పేరిట టీటీడీ అన్నప్రసాద కేంద్రంలో ప్రత్యేకంగా అన్నదానం నిర్వహించారు.

## ఇరాన్ పై కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు...
## భారీగా ఆయుధాలు తరలిస్తున్న అమెరికా!

అమెరికా: మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయా? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్ లక్ష్యంగా మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ తమ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే, అమెరికా నుంచి మరోసారి భీకర దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అణు ఆయుధాల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తే సహించేది లేదని, అవసరమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని ట్రంప్ తేల్చిచెప్పారు.

**సైనిక మోహరింపుతో ఉద్రిక్తత**

ట్రంప్ హెచ్చరికలకు తగ్గట్టుగానే క్షేత్రస్థాయిలో అమెరికా సైనిక కదలికలు వేగవంతమయ్యాయి. అత్యాధునిక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌ను అమెరికా అరేబియన్ సముద్రం/పర్షియన్ గల్ఫ్ దిశగా తరలిస్తోంది. దీనికి తోడు ఎఫ్15ఈ స్ట్రైక్ ఈగల్ జెట్‌లు, గగనతలంలోనే ఇంధనం నింపే కేసీ135 ఎయిర్‌క్రాఫ్ట్‌లను అమెరికా సిద్ధం చేసింది. ఇరాన్ క్షిపణి దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు థాడ్ , పేట్రియాట్ వంటి శక్తివంతమైన యాంటీ మిస్సైల్ సిస్టమ్స్‌ను మధ్యప్రాచ్యంలో మోహరించారు. ఇజ్రాయెల్, ఖతార్ వంటి మిత్రదేశాల్లో కూడా రక్షణ వ్యవస్థలను అమెరికా మరింత పటిష్టం చేయడం గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతకు అద్దం పడుతోంది.

**అణు కేంద్రాలపై ఆందోళన**

గత ఏడాది జూన్‌లో అమెరికా ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఫోర్డో అణు కేంద్రంపై జరిగిన బంకర్ బస్టర్ దాడుల తర్వాత అక్కడి నుంచి సుమారు 400 కిలోల సుసంపన్న యురేనియం అదృశ్యమైందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత ఏడు నెలలుగా అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (IAEA) తనిఖీలు నిలిచిపోవడంతో ఇరాన్ రహస్యంగా అణు ఆయుధాలను తయారు చేస్తోందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

**శాంతి చర్చలకు అవకాశం ఉందా?**

యుద్ధ వాతావరణం కనిపిస్తున్నప్పటికీ, ట్రంప్ 'బోర్డ్ ఆఫ్ పీస్' అనే కొత్త అంతర్జాతీయ సంస్థను ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. గాజా సమస్యతో పాటు ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపనకు ఈ సంస్థ కృషి చేస్తుందని ఆయన చెప్పారు. అయితే, ఇరాన్ తన ప్రాక్సీల ద్వారా హోర్ముజ్ జలసంధిలో నౌకలను అడ్డుకోవడం లేదా ప్రతీకార దాడులకు దిగడం వంటివి చేస్తే పరిస్థితి చేజారిపోయే ప్రమాదం ఉంది. ఇజ్రాయెల్ కూడా తమ ఐరన్ డోమ్, ఆరో సిస్టమ్స్‌తో అప్రమత్తంగా ఉంది. మొత్తానికి ట్రంప్ మాటల్లో బెదిరింపులు ఉన్నప్పటికీ, చర్చలకు కూడా దారులు తెరిచే ఉంచినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## పుణేలో తీవ్ర విషాదం...
## సైకిల్‌పై వెళుతుండగా కారు కింద పడి బాలుడు మృతి

పూణె: పుణే నగరంలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. లోనికల్భోర్ ప్రాంతంలోని ఓ రెసిడెన్షియల్ హౌసింగ్ సొసైటీ ఆవరణలో వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో ఐదు సంవత్సరాల బాలుడు మృతి చెందాడు. జాయ్‌నెస్ట్ హౌసింగ్ సొసైటీలో ఈ దుర్ఘటన సంభవించింది. మధ్యాహ్నం బాలుడు తన నివాస సముదాయంలో ఆడుకుంటుండగా, కుటుంబ సభ్యులు కూడా అక్కడే ఉన్నారు. అదే సమయంలో వేగంగా వచ్చిన కారు బాలుడిని ఢీకొట్టింది. అనంతరం, కారు నడుపుతున్న వ్యక్తి కిందకి దిగి బాలుడిని పైకి లేపాడు. తీవ్ర గాయాలపాలైన బాలుడిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతి చెందిన బాలుడిని నిష్కర్ష్ అశ్వత్ రెడ్డిగా గుర్తించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది. బాలుడు పార్కు చేసిన కార్ల మధ్య నుంచి రోడ్డుపైకి వస్తుండగా, అదే మార్గంలో వచ్చిన నీలి రంగు కారు అతడిని ఢీకొట్టినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది.

## మేడారం జాతరకు
## కేంద్ర ప్రభుత్వం రూ.3.70 కోట్లు విడుదల

ములుగు: మేడారం జాతర నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం శుభవార్తను వెల్లడించింది. సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహణ కోసం నిధులను విడుదల చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా రూ.3.70 కోట్లను విడుదల చేశాయి. కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి చొరవతో ఈ నిధులు విడుదలయ్యాయి. మేడారం పరిసర ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గిరిజన సర్క్యూట్ పేరుతో గతంలో రూ.80 కోట్లతో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించింది. అంతేకాకుండా రామప్ప దేవాలయం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.140 కోట్లు ఖర్చు చేస్తోంది.

## కేరళలో కొత్త రైళ్లకు ప్రధాని మోదీ పచ్చజెండా..
## తెలుగు రాష్ట్రాలకు మరో సర్వీస్

కేరళ: ప్రధాని నరేంద్ర మోదీ కేరళలో కొత్త రైల్వే సేవలకు ఈరోజు పచ్చజెండా ఊపారు. తిరువనంతపురం నుంచి మూడు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఒక ప్యాసింజర్ రైలును ఆయన ప్రారంభించారు. దేశంలో రైల్వే కనెక్టివిటీని ఆధునికీకరించే ప్రయత్నాల్లో భాగంగా ఈ కొత్త సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు. కొత్తగా ప్రారంభించిన వాటిలో తిరువనంతపురం చర్లపల్లి, నాగర్‌కోయిల్ మంగళూరు, తిరువనంతపురం తాంబరం అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. వీటితో పాటు త్రిస్సూర్ గురువాయూర్ మధ్య కొత్త ప్యాసింజర్ రైలును కూడా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఈ రైళ్లు తమ గమ్యస్థానాలకు బయలుదేరాయి. ఈ నాలుగు సర్వీసులను దక్షిణ రైల్వే నిర్వహించనుంది. తిరువనంతపురం చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ ప్రయాణిస్తుంది. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చనుంది. అలాగే, తిరువనంతపురం తాంబరం రైలు తమిళనాడులోని పారిశ్రామిక, విద్యా కేంద్రాలకు అనుసంధానంగా ఉంటుంది. అమృత్ భారత్ రైళ్లను సామాన్యులకు తక్కువ ధరలో మెరుగైన సౌకర్యాలు అందించేలా రూపొందించారు. ఇవి నాన్‌ఏసీ రైళ్లు అయినప్పటికీ, వీటిలో ప్రయాణికుల భద్రత కోసం ప్రతి కోచ్‌లో సీసీటీవీ కెమెరాలు, ప్రతి సీటుకు ఫోన్ చార్జర్ సాకెట్, బాటిల్ హోల్డర్ వంటి వసతులు కల్పించారు. కోచ్‌లు విశాలంగా, సౌకర్యవంతంగా ఉన్నాయని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. సంప్రదాయ రైళ్లకు, ప్రీమియం రైళ్లకు మధ్య అంతరాన్ని తగ్గించి, తక్కువ ఛార్జీలతో మెరుగైన ప్రయాణ అనుభూతిని అందించడమే ఈ రైళ్ల లక్ష్యమని రైల్వే అధికారులు తెలిపారు.

# ఘనంగా మహర్షి విద్యా మందిర్ 25 వ వార్షికోత్సవం




శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి :హైదరాబాద్‌లోని కొండాపూర్ లోని మహర్షి విద్యా మందిర్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల రజతోత్సవ సంవత్సర ముగింపుకు ప్రతీకగా నిలిచింది.నర్సరీ నుంచి ఏడవ తరగతి వరకు చదువుతున్న 2500 మందికి పైగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గురుపూజ, విద్యార్థుల ప్రార్థనా గీతాలాపనతో వేడుకలు ప్రారంభమయ్యాయి.పాఠశాల ప్రిన్సిపాల్ వసంతి పరశురామన్ సభకు హాజరైన అతిథులు, తల్లిదండ్రులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల 25 ఏళ్ల ప్రస్థానం, సాధించిన అభివృద్ధి, విద్యారంగంలో అందించిన సేవలపై సంక్షిప్త నివేదికను సమర్పించారు. పాఠశాలలో అమలవుతున్న అతీంద్రియ ధ్యాన కార్యక్రమం, మహర్షి మహేష్ యోగి ప్రతిపాదించిన చైతన్య ఆధారిత విద్యా విధానం గురించి ఆమె వివరించారు.మహర్షి విద్యా సంస్థల గౌరవ చైర్మన్ బ్రహ్మచారి డాక్టర్ గిరీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా అతీంద్రియ ధ్యానం అభ్యసించడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలతో పాటు సమాజంలో శాంతి, స్థిరత్వం నెలకొంటుందని అన్నారు. మహర్షి విద్యా మందిర్ పాఠశాలల్లో అతీంద్రియ ధ్యానం, యోగా పాఠ్య ప్రణాళికలో భాగంగా ఉండటం విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు దోహదపడుతోందని తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్.కె. జయచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో దేశభక్తి, భక్తి, జానపద ఇతివృత్తాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతిని ప్రతిబింబించే నృత్యాలు, గీతాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణలుగా 'కృష్ణ లీలలు', 'శ్రీవారి వైభవం' నిలిచాయి. శ్రీకృష్ణుని బాల్య లీలలను అందంగా చిత్రించిన 'కృష్ణ లీలలు' అందరి మనసులు దోచుకోగా, కూచిపూడి నృత్య రూపకంగా ప్రదర్శించిన 'శ్రీవారి వైభవం'లో తిరుమల ఆలయం, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య మహిమను, వివిధ సేవలను అద్భుతంగా ఆవిష్కరించారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు మనందరికీ ఆదర్శం

*** ఆల్వీన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : భారతదేశ స్వాతంత్ర పోరాటంలో తనకంటూ ఓ ప్రత్యేకత సాధించుకున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు మనందరికీ ఆదర్శమని ఆల్వీన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. భారతదేశ స్వాతంత్రం కొసం పోరాడిన, భారతదేశ కీర్తి కిరీటం నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి సందర్భంగా శుక్రవారం అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ సుభాష్ చంద్రబోస్ నగర్ లో గల నేతాజీ విగ్రహానికి కార్పొరేటర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటం అహింసా మార్గంలోనే కాదు వీర మార్గంలోనూ బ్రిటీష్ వారిపై పోరాడుదామని పిలుపిచ్చిన మహావీరుడన్నారు. సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చునని నమ్మి, అది ఆచరణలో పెట్టిన యోధుడు సుభాష్ చంద్రబోస్ అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, జి. రవి, గోపాల్, సీహెచ్.భాస్కర్, పోశెట్టిగౌడ్, షేక్ బీబీ, మజర్, లింగం, సుధాకర్, సత్తయ్య, రమేష్, రాజు గౌడ్, మహేష్, రవీందర్, ఖలీమ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## పంచశీల ఉన్నత పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు




కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : కూకట్ పల్లి నియోజక వర్గం మూసాపేటలోని పంచశీల ఉన్నత పాఠశాలలో శుక్రవారం గాయత్రి పరివార్ వారి అధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు సాముహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి వేడుకలలో ప్రధానోపాధ్యాయులు డి శ్రీనివాసులు , డి అనిత లు పాల్గొని నేతాజీ సుభాష్ చంద్ర బోస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

### శ్రీ సాయి విద్యానికేతన్ స్కూల్లో

## వసంత పంచమి వేడుకలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విద్యానగర్ లోని శ్రీ సాయి విద్యానికేతన్‌స్కూల్, శుక్రవారం వసంత పంచమి శుభ సందర్భంగా వేద పండితులచే చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి , ఉపాధ్యాయ బృందం సమన్వయంతో నిర్వహించారు.

## కొత్తగూడెంలో కథా–కవితా కార్యశాల




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో బాలోత్సవ్ చిల్డ్రన్స్ కల్చరల్ సొసైటీ, కొత్తగూడెం క్లబ్ ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతి విద్యార్థుల కోసం రెండు రోజుల కథా-కవితా కార్యశాల ప్రారంభమైంది. శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డా. వాసిరెడ్డి రమేష్‌బాబు ప్రారంభించారు. జనవరి 23, 24 తేదీల్లో జరిగే ఈ కార్యశాలలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కవులు, కథకులు విద్యార్థులకు కథలు, కవితలు రచించడంపై శిక్షణ ఇస్తున్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం క్లబ్ కార్యదర్శి కోనేరు పూర్ణచంద్రరావు సహా నిర్వాహకులు పాల్గొన్నారు.



## ఘనంగా రాందేవ్ రావు హాస్పిటల్ వ్యవస్థాపకురాలు రాణి కుముదిని దేవి జయంతి వేడుకలు




కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కి మొదటి మహిళ మేయర్ , విద్యావేత్త, సంఘ సంస్కర్త, నిస్వార్ధ రాజకీయ వేత్త,బహుముఖ ప్రజ్ఞశాలి, అట్టడిగిన వర్గాలకి, కుష్టు వ్యాధిగ్రస్తుల అశా దీపం, రాందేవ్ రావు హాస్పిటల్ వ్యవస్థాపకురాలు రాణి కుముదిని దేవి జన్మదినాన్ని పురస్కరించుకొని శివనంద రెహబిలిటేషన్ హోమ్,రాందేవ్ రావు హాస్పిటల్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మొదటగా రాందేవ్ రావు హాస్పిటల్ లో రాణి కుముదిని దేవి చిత్ర పటానికి రాందేవ్ రావు హాస్పిటల్ యండి. డాక్టర్ కమలాకర్ పూల మాల వేసారు. అనంతరం కుముదిని దేవి స్కూల్ అండ్ కాలేజ్ అఫ్ నర్సింగ్ లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్స్, నర్సెస్, అడ్మినిస్ట్రేషన్ , ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొని ఆమె చేసిన కార్యక్రమాలు కొనియాడారు. అనంతరం శివనంద రెహబిలిటేషన్ హోమ్ లో ఆమె విగ్రహానికి రంతిదేవ్ రావు, మీరా రావు, విక్రందేవ్ రావు, జ్యోతి రావు, విజయలక్ష్మి,పృథ్వీరెడ్డి, భారతి రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి,అపర్ణ రావు, ప్రశాంత్ రెడ్డి, శివానంద రిహబిలిటేషన్ హోమ్ సీఎఒ డాక్టర్ అనంత్ రెడ్డి లు పూల మాలతో ఆమె విగ్రహాన్ని అలంకరించారు.జస్టిస్ జగన్నాద్ రెడ్డి సతీమణి పరిమళ జగన్మోహన్ రెడ్డి పేరు మీద ఉచిత శివనంద ఫిజియో రిహబ్ సెంటర్ ప్రదీప్ చౌదరి ప్రారంభించారు. పరిమళ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటాన్ని జయరాం పింగళి, ఊర్మిళ పింగళి, గౌతమ్ పింగళి, సురేఖ పింగళి, విద్యాసాగర్ రావు, దీపిక లు పాల్గొని ఆవిష్కరించారు. తర్వాత రాణి కుముదిని దేవి స్కూల్ అండ్ కాలేజీ అఫ్ నర్సింగ్ లో కొత్తగా ప్రవేశించిన బీఎస్సీ , జీఎన్ఎం విద్యార్థిని విద్యార్థులకు లాంప్ లైటింగ్ సెర్మని ప్రారంభించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ ప్రతిజ్ఞ ను మేరీ డేవిడ్ , కాలేజీ ప్రిన్సిపాల్ అర్చన విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో రాందేవ్ రావు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్,సీఈఓ డాక్టర్ యోబు , ఇతర హాస్పిటల్ , కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.




## రంజాన్ మాసానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఫిబ్రవరి 18 నుంచి ప్రారంభమయ్యే పవిత్ర రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని మసీదుల పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రతను కాపాడాలని, త్రాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్సులు, శాంతిభద్రతల కోసం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. రంజాన్ పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకొని పాలు, నిత్యావసర వస్తువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా దుకాణాలు ఎక్కువ సమయం తెరిచి ఉండేలా చూడాలని తెలిపారు. ప్రజలందరూ శాంతి సామరస్యాలతో ఆనందంగా రంజాన్ పండుగను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మత పెద్దలు పాల్గొన్నారు.

*** రామవరం ఈద్గా రోడ్డు సమస్యపై కలెక్టర్‌కు వినతి – తక్షణ చర్యలకు ఆదేశం**

కొత్తగూడెం రామవరం ఈద్గా కు వెళ్లే రోడ్డుకు సంబంధించిన సమస్యను కొత్తగూడెం మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ ఎండీ ఖాజా బక్ష్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్, అక్కడే ఉన్న కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాతకు సంబంధిత స్థలాన్ని సందర్శించి మేజర్‌మెంట్ చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ గౌస్ మైనుద్దీన్, జిల్లా సెక్రెటరీ గౌస్, షేక్ కరీం కాద్రి, షేక్ నయం, ఎండీ మహమూద్ ఖాద్రి, అప్సర ఖాన్, ఎండీ ఖాదర్, అర్మాన్ బాక్స్, విల్సన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి

*** చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**



చేవెళ్ల , (ప్రజాస్ఫూర్తి) : రైతుల సంక్షేమాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. నవాబ్ పేట్ మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో నవాబ్ పేట్ మండలానికి సంబంధించిన రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం రాయితీ పై పరికరాలను శుక్రవారం ఆయన పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టేవాడు రైతు అని, వ్యవసాయ రంగంలో ప్రస్తుతం టెక్నాలజీకి సంబంధించిన యంత్రాలను ఉపయోగించి రైతులు వ్యవసాయం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.36,04,176 విలువ గల 36 కళ్యాణ లక్ష్మీ / షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ బ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడిపూజ



చేవెళ్ల, ప్రజాస్ఫూర్తి : చేవెళ్ల నియోజకవర్గం నవాబ్ పేట్ మండలం మాదిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ బ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు..

**- పాఠశాలలు, అమ్మవారి ఆలయాల్లో అక్షరాభ్యాసాలు**




అందోలు, ప్రజాస్ఫూర్తి : చదువుల తల్లి సరస్వతీ దేవి జన్మదినం సందర్భంగా శుక్రవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని తల్లిదండ్రులు తమ చిన్నారులకు అమ్మవారి ఆలయాల్లో అక్షరాభాస్యం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. అలాగే వసంత పంచమి సందర్భంగా ఆయా ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నారులతో అక్షరాభ్యాసం నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా ఆయా పాఠశాలలు ఉచిత అడ్మిషన్లు చేసుకున్నారు.

## సీఎం సహాయనిధి.. నిరుపేదలకు వరం

**- అర్ధ వెంకట్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని నిరుపేదల పాలిట సీఎం సహాయనిధి వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు అర్ధ వెంకట్ రెడ్డి అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మండలంలోని అల్లాపురం గ్రామానికి చెందిన గూడూరు లావణ్య రెడ్డికి మంజూరైన రూ.60వేల విలువైన సీఎం సహాయనిధి చెక్కును శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా అర్ధ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. పేదల ఆరోగ్యం పట్ల, ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య ఖర్చులపై ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందన్నారు. సీఎం సహాయనిధి చెక్కు మంజూరీకి సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అర్ధ జనార్దన్ రెడ్డి, వార్డు సభ్యులు సుర్కంటి స్వాతి శ్రీనివాస్ రెడ్డి , మాజీ ఉప సర్పంచ్ బొడ్డు జంగయ్య, పక్కిరు ఎల్లారెడ్డి, రాచకొండ మల్లేష్, ముత్యాల జంగారెడ్డి, అర్ధ కమలమ్మ, సింగిరెడ్డి సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం.. శారీరక దృఢత్వం

*** వీర శైవ లింగ బలిజ సంఘం రాష్ట్ర యువజన నాయకులు శివ చరణ్**



అందోలు, ప్రజాస్ఫూర్తి : క్రీడలతో మానసికోల్లాసం..శారీరక దృఢత్వం లభిస్తుందని వీర శైవ లింగ బలిజ సంఘం రాష్ట్ర యువజన నాయకులు పి.శివ చరణ్ అన్నారు. మర్వెళ్లి గ్రామంలో రెండు రోజుల పాటు జరిగిన ముగింపు వేడుకల్లో ఎస్ఐ లవకుమార్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ గౌడ్ లతో కలిసి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడా పోటీలలో ప్రతి ఒక్కరూ గెలుపు, ఓటములు సహజమని ఓటమి గెలుపుకు తొలి అడుగు అన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపేవారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని గ్రామీణ క్రీడల్లో రాణించే వారు జాతీయ స్థాయి ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యతను కల్పిస్తూ , గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. జీవితంలో స్థిరపడాలన్నా, ఉద్యోగాలు సంపాదించాలన్నా భవిష్యత్‌లో స్పోర్ట్స్ కోటా ఉంటుందని తెలపారు. ఈ కార్యక్రమంలో కేరూర్, వట్ పల్లి సర్పంచ్ లు పెద్దపట్ల కార్తీక్ గౌడ్, ఎం.రవీందర్, ఎన్ఎస్ యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజా తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

*** జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన వజ్రాయుధమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత గల పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఐడీఓసీ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కుపై అవగాహన పెంపొందించడం ద్వారా బాధ్యతాయుతమైన పాలన సాధ్యమవుతుందని తెలిపారు. యువత ఓటరుగా నమోదు కావడంతో పాటు ఎన్నికల్లో పాల్గొనేలా అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, వివిధ శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

**: దేప శ్యాంసుందర్**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఆజాద్ హిందూ ఫౌజ్ దళపతి నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు దేప శ్యాంసుందర్ ముదిరాజ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామం నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు దేప శ్యాంసుందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సంఘం ఆవరణలో నేతాజీ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దేప శ్యాంసుందర్ మాట్లాడుతూ స్వాతంత్రం ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ అత్యంత కీలక పాత్ర పోషించారన్నారు. స్వాతంత్ర ఉద్యమానికి వేలాది మంది సైనికులని ఏర్పాటు చేసిన మహనీయుడు అని కొనియాడారు. భారతవనిలో దేశభక్తిని రగిలించి ఆజాద్ హిందూ ఫౌజ్ దళాన్ని స్థాపించి ఆంగ్లేయులు గుండెల్లో వణుకు పుట్టించిన భారతమాత ముద్దుబిడ్డ నేతాజీ సుభాష్ అను కొనియాడారు. నేతాజీ దేశానికి చేసినా సేవలను ఎన్నటికీ మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ముదిగొండ మహేష్, ఉపాధ్యక్షుడు రాచర్ల ఈశ్వర్, గ్రామ ఉపసర్పంచ్ మీసాల నర్సింహ్మ, మాజీ అధ్యక్షుడు ఈద్దుల ఐలయ్య యాదవ్, మునుకుంట్ల నర్సింహ్మా గౌడ్, ఈద్దుల హరిప్రసాద్, పబ్బు శ్రీనివాస్ గౌడ్, మొగిలి మహేందర్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శులు ఈద్దుల మస్తాన్ బాబు యాదవ్, నెల్లికంటి హరిప్రసాద్, వార్డు మెంబర్ ఈద్దుల ఇంద్రసేన యాదవ్, సభ్యులు కంచర్ల మధుసూదన్ రెడ్డి, దౌడి రాజేష్, కలగోని వెంకటేష్, ఈద్దుల నరేష్, బాతరాజు శివకృష్ణ, సంఘ సీనియర్ సభ్యులు పటేల్ వెంకట్ రెడ్డి, గోపనబోయిన నగేష్, దౌడి పెద్ద యాదగిరి, గుండ్ల అశోక్, ఈద్దుల బాబు యాదవ్, సిలివేరు వెంకటేష్, సుక్క కృష్ణ, దౌడి వేంకటేష్, ఈద్దుల కేశవ్, ఎల్లంకి సురేష్, నెల్లికంటి గురుప్రసాద్ ఈద్దుల పరమేష్, ఈద్దుల గణేష్, నెల్లికంటి శ్రీకాంత్, ఒంటెద్దు రాజు, బుర్ర శివ కుమార్ గౌడ్, దౌడి లింగస్వామి, గుండ్ల లింగస్వామి, నెల్లికంటి శ్రీకాంత్, చందుపట్ల సాయి నేత, బుర్ర విజయ్ గౌడ్ పక్కిరు ప్రభాకర్ రెడ్డి, ఈద్దుల రాజేష్, బుర్ర శ్రీకాంత్, ఈద్దుల సాయి కిరణ్, సిలువేరు సాయి, సందగళ్ళ నవీన్, కంచర్ల నవీన్ రెడ్డి, ముదిగొండ నరేష్, తిరుమలేష్, దేప అరుణ్, బాలు తదితరులు పాల్గొన్నారు



## త్రినిటీలో వసంత పంచమి వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ పాఠశాలలో సరస్వతి అమ్మవారి జయంతి సందర్భంగా నిర్వహించే వసంత పంచమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ట్రినిటీ విద్యాసంస్థలు అక్షరాభ్యాస కార్యక్రమంలో భాగంగా 286మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కిషోర్ శర్మ ఆధ్వర్యంలో గణాలకు అధిపతి అయినా గణపతి పూజ, మనల్ని రక్షిస్తున్న నవగ్రహాల పూజ చదువుల తల్లి సరస్వతీ దేవికి తెల్లని పుష్పాలతో మున్సిపల్ ఛాంబర్ ఛైర్మెన్ వెన్ రెడ్డి రాజు, గాంధీ గ్లోబల్ ట్రస్ట్ మండల అధ్యక్షురాలు వెన్ రెడ్డి సంధ్యలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. సరస్వతి దేవి దీవెనలతో విద్యా, మంచి బుద్ధులు, సంస్కారవంతమైన జీవనం గడపాలని ఆ తల్లిని వేడుకున్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జీని మంజుల గారు, విద్యాసంస్థల చైర్మన్ కే వి బి కృష్ణారావులు సరస్వతీ విగ్రహం చుట్టూ కమలం వీణ ఇతర పుష్పాలను అలంకరణ చేశారు. అక్షరాభ్యాసం చేసిన చిన్నారులకు పలక, బలపం, ప్రసాదం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు మాలిక్, శివరాణి, శ్రీవాణి మంజుల, స్వప్న,నీరజ, జ్యోతి, ప్రీతి,లక్ష్మీ ప్రియ, లవ కుమారి, చందన, సుమలత, స్వరూప భార్గవి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేత



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 12వ వార్డుకు చెందిన సిరికొండ రాములమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొబ్బిళ్ళ మురళి రాములమ్మ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. ఆమె భర్త నరసింహకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కంచరగుంట్ల శశిధర్ రెడ్డి, అన్నారం బాలయ్య, మాజీ వార్డు సభ్యులు మలిగె యాదయ్య, మొగుదాల మల్లేష్ గౌడ్, బోయ మంకులు, మలిగె నరసింహ, మల్లేష్, బాతరాజు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువలో మీసేవ కీలకం

**: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి సకాలంలో చేరాలంటే మీసేవ కేంద్రాలు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో మెగా ఆధార్ క్యాంపుల ద్వారా విశేష సేవలు అందించిన మీసేవ కేంద్ర నిర్వాహకులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు.ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్ సేవలు, స్కాలర్షిప్‌లు, ప్రభుత్వ పథకాల దరఖాస్తుల్లో మీసేవ కేంద్రాలు ప్రజలకు మొదటి సంప్రదింపు కేంద్రాలుగా పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రజలకు స్పష్టమైన సమాచారం, వేగవంతమైన సేవలు అందిస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. మెగా ఆధార్ క్యాంపుల ద్వారా వేలాదిమందికి సేవలు అందించడం అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు.




## మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల రీజనల్ స్థాయి ముగింపు కార్యక్రమం శుక్రవారం కొత్తగూడెం డిపోలో జరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ ఏ.సరి రాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఆర్టీఓ భూషిత్ రెడ్డి, ఎంవీఐ వెంకట రమణ, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రమాద రహిత సేవలందించిన డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. ప్రథమ స్థానం సత్తుపల్లి డిపోకు చెందిన ఎస్.ఎస్.రావు (30సం.4నెలలు), ద్వితీయ స్థానం ఖమ్మం డిపోకు చెందిన జి.ఎన్.రావు (29సం.3నెలలు), తృతీయ స్థానం ఖమ్మం డిపోకు చెందిన ఆర్.వెంకటేశ్వర్లు (27సం.9నెలలు)కు లభించింది. అలాగే జిల్లాలోని 7 డిపోల నుండి ఉత్తమ డ్రైవర్లకు క్యాష్ అవార్డులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణీకుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీటీఓ, ఎంవీఐలు సురక్షిత డ్రైవింగ్, వాహనాల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి, భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. అన్ని డిపోల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో ఘనంగా వసంత పంచమి పూజలు




జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి: వసంత పంచమి సందర్భంగా సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ నాయక్ నగర్ లోని " సత్యవాణి విద్యా నికేతన్ హై స్కూల్, అపురూప కాలనీ లోని టీవిఆర్ మోడల్ హై స్కూల్ నందు టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తో పాటు కరస్పాండెంట్ అరుణ కుమారి పాల్గొని సరస్వతి అమ్మవారి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల లో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు చదువుల తల్లి సరస్వతి దేవి అనుగ్రహం , జ్ఞాన సంపద, విద్యా తేజస్సు సంప్రాప్తించాలని అమ్మవారికి అభిషేకాది అర్చనలు జరిపించారు ప్రతి సంవత్సరం వలె మార్చ్ 2026 లో పరీక్షలు రాయనున్న విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల కీర్తిని చాటేలా జ్ఞాన సంపన్నులుగా ఆశీర్వదించి మా కోరికను మన్నించమని విద్యార్థులు సరస్వతి అమ్మవారిని మొక్కి కొలిచారు. అనంతరం టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి.కోటి రెడ్డి , అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి లు వసంత పంచమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం జయరాజ్ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు మనందరికీ ఆదర్శం

*** రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు మనందరికి ఆదర్శమని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ అన్నారు. శుక్రవారం నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి సందర్భంగా రంగారెడ్డినగర్ డివిజన్,వెంకట్రామరెడ్డి నగర్ ప్రాంతంలోని స్థానిక నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జల్ద లక్ష్మీనాథ్ లు పాల్గొని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాకు రక్తాన్ని ఇవ్వండి..నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తానని నినదించి,బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ధీరుడు.భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాట పటిమను,దేశభక్తిని రగిలించిన దేశానికి సేసిన సేవలు అజరామరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, కార్తిక్ గౌడ్, సంతోష్ గౌడ్, భాస్కర్ రెడ్డి, సాదక్, కిరణ్, యువజన సంఘం నాయకులు సతీష్ గట్టాజీ, నాయకులు, శంకరయ్య , లక్షణ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రషీద్, మల్లేశ చారి, సుధాకర్, కార్తీక్ గౌడ్,క్రాంతి యాదవ్, షకీల్ సంతోష్, అంజి ముదిరాజ్,అలాఉద్దీన్, బాలు నేత, తిమ్మయ్య, నవీన్, మహాదేవ్, రాజిరెడ్డి, సత్తయ్య డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : వసంత పంచమి పర్వదినం సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి,భగత్ సింగ్ మార్గ్ లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుల తల్లి సరస్వతి దేవి అమ్మవారికి మేడ్చల్ జిల్లా ట్రస్మా ప్రధాన కార్యదర్శి,శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల చైర్మన్ కరెస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు, ప్రిన్సిపాల్ బిర్రు శోభారాణి,అధ్యాపక బృందం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అధ్యాపక బృందం చిన్నారులకు పలకలు, బలపాలు అందించి తల్లిదండ్రులతో కలిసి చిన్నారుల చే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించి ఉన్నత విద్యా వంతులుగా ఎదగాలని ఆశీర్వదించారు. తమ పాఠశాలలో చదివే చిన్నారులను తమ కుటుంబసభ్యుల వలే చూసుకుంటూ విద్యాబుద్ధులు నేర్పుతూ బావి భారత పౌరులుగా తీర్చిదిద్దమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం ప్రశాంతి, అన్నే ఫాతిమా, ప్రసన్న, సరళ, కృష్ణవేణి, మహేశ్వరి, సాజిత, సుభాషిణి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైష్ణవి టెక్నో స్కూల్ లో వైభవంగా వసంత పంచమి వేడుకలు





జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : వసంత పంచమి పర్వదినం సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి సంజయ్ పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో శుక్రవారం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చదువుల తల్లి సరస్వతి దేవి అమ్మవారి కి వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు పలకలు, బలపాలు అందించి చిన్నారుల తల్లిదండ్రులతో కలిసి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాక్షాత్తు సరస్వతి మాత వసంత పంచమి రోజు జన్మించారని, , అంత పవిత్రమైన రోజు అక్షరాభ్యసం చాలా విశిష్టత కల్గి ఉండటం వలన చాలా మంది తల్లి దండ్రులు తమ పిల్లలకుఅక్షరాభ్యాసం చేయిస్తారన్నారు. సరస్వతి దేవి దీవెనలతో విద్యా, మంచి బుద్ధులు, సంస్కారవంతమైన జీవనం గడపాలని ఆ తల్లిని వేడుకున్నారు. వసంత పంచమి సందర్భంగా ఉచిత అడ్మిషన్లు చేసుకున్నారు , ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శిల్ప, ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రవాణాలో మహిళలు..!

- **బస్సులో గంజాయి తరలించే ప్రయత్నం**
- **42 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పాల్వంచ పోలీసులు**
- **కొత్తగూడెంలో 132 కిలోల గంజాయి స్వాధీనం**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గంజాయి రవాణా రంగంలోకి మహిళలు కూడా దిగారు. అనుమానిత పురుషులపై నిఘా ఉన్న నేపథ్యంలో మహిళలపై అనుమానం రాదనే ఉద్దేశ్యంతో వారితో గంజాయి రవాణా సాగిస్తుండగా పాల్వంచ పట్టణ పోలీసులు ఆ మహిళల నుంచి గంజాయి స్వాధీనం చేసుకోవడం సంచలనంగా మారింది. అంతేకాక ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగించి గంజాయిని తరలించే ప్రయత్నం చేయడం గమనార్హం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గంజాయి రవాణా సర్వసాధారణం అయినప్పటికీ పాల్వంచ పట్టణంలో జరిగిన ఈ సంఘటన ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నిత్యం గంజాయి రవాణాను పోలీసులు అడ్డుకుంటుండటంతో స్మగ్లర్లు కొత్తదారులు వెతక్కుంటున్నారని ఈ సంఘటనతో బయటపడింది. పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ తెలిపిన వివరాల్లోకి వెళితే... విశ్వసనీయ సమాచారం మేరకు పాల్వంచ బస్టాండ్‌లో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు మహిళలు, ఒక వ్యక్తిని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి ప్యాకెట్లు లభించాయి. వారి వద్ద నుంచి సుమారు రూ.20 లక్షల విలువచేసే 42 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, గంజాయి రవాణాలో పాల్గొన్న నలుగురు మహిళలు, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ప్రైవేటు వాహనాలను ప్రతినిత్యం తనిఖీలు చేస్తుండటంతో స్మగ్లర్లు ప్రజారవాణా వ్యవస్థను వినియోగించుకుంటున్నారని, ఇకపై నిఘాను మరింత కట్టుదిట్టం చేస్తామని డీఎస్పీ వివరించారు.

**– 'గూడెం'లో రూ.66.25 లక్షల గంజాయి పట్టివేత**

గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల నిఘా కొనసాగుతోంది. ఈ క్రమంలో సీసీఎస్ పోలీసులు, కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.66.25 లక్షల విలువైన 132.5 కేజీల నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ అబ్దుల్ రహమాన్ వివరాలు తెలియజేశారు. గురువారం మధ్యాహ్నం ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు కొత్తగూడెం పట్టణం సుబాగ్ చంద్రబోస్ నగర్ పరిధిలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. టీఎన్-99 జె 7130 నంబరు గల ఐచర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో భారీగా గంజాయి లభ్యమైనట్లు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. గంజాయి తరలిస్తూ పట్టుబడిన వారిలో తమిళనాడుకు చెందిన డ్రైవర్లు కొమురాజు, రాజగోపాల్ ఉండగా, మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితుల వద్ద నుంచి గంజాయితోపాటు ఐచర్ వాహనం, ఒక సెల్‌ఫోన్, రూ.3 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వారిని శుక్రవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని అన్నారు. గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తనిఖీల్లో పాల్గొన్న పోలీసు అధికారులను ఆయన అభినందించారు.





# సంస్కృతి పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : వసంత పంచమి సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప సముదాయంలోని సంస్కృతి పాఠశాలలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సరస్వతి దేవి పూజ చేశారు. అనంతరం చిన్నారులకు అక్ష్యరబ్యాసం చేయించారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ గడ్డమీది బాలరాజు, ఉపాధ్యాయులు రాజకుమారి, కృష్ణ ప్రసాద్, రజిత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.





# వైభవంగా శ్రీవారి 55 వ బ్రహ్మోత్సవాలు

*** కన్నుల పండువగా శ్రీవారి కల్యాణ మహోత్సవం .**









జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట కొండపై వెలసిన శ్రీ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ ఇష్టవైవం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి 55 వ బ్రహ్మోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం వసంతపంచమి సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకము, ధ్వజారోహణము, హోమం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీవారి కల్యాణ మహోత్సవం కనుల పండుగగా జరిగింది. శ్రీ వారి కళ్యాణాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శనం చేసుకొని తిరు కళ్యాణాన్ని తిలకించారు.. ఈ కళ్యాణ మహోత్సవానికి స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ దంపతులు,వారి కుటుంబ సభ్యులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కొలను హనుమంత్ రెడ్డి ఆయన సతిమణి, బిజెపి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్,బిఆర్ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి, కృష్ణ గౌడ్,తోపాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొని శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ కార్య నిర్వహణాధికారి కృష్ణమాచార్యులు,చైర్మన్ కానుగంటి నరేందర్ రెడ్డి, ధర్మకర్తల మండల సభ్యులు అతిథిలకు సాదరంగా ఆహ్వానం పలికారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు, సిబ్బంది తగిన ఏర్పాటు చేశారు.స్థానిక జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సిఐ.బి.వెంకటేశం, ఎస్ఐ. వినయ్ నేతృత్వంలో ఆలయ సమీపంలో అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు నిఘాతో పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు. అనంతరం జగద్గిరిగుట్ట కొండపై గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు,ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం సాయంత్రం స్వామి వారి పల్లకి సేవ (ఊరేగింపు) కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈఓ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షులు పార్శి ప్రకాష్ గుప్తా,స్థానిక వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయ పౌండర్ చైర్మన్ రేగూరి ప్రవీణ్ కుమార్ గుప్తా,చైర్మన్ నేతి శంకర్ గుప్తా,అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్తా,వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి అన్నయ్య గుప్తా, ధర్మకర్తలు బుచ్చి రెడ్డి, వేణు గౌడ్, రవీందర్, రాజు, సునీత, శ్రీనివాస్ చారి, డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రషీద్, పిల్లి ఆంజనేయులు, మాధవి రెడ్డి, సంజీవ్ రెడ్డి, సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి, మైసిగారి శ్రీనివాస్, అరుణ్ రెడ్డి, చంద్రకళ, అనిత రెడ్డి, రజిత, గఫ్ఫార్, శ్రీనివాస్ , ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. ఆ ప్రచారం నమ్మొద్దు: సీపీ సజ్జనార్

హైదరాబాద్: పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ను సిట్ అధికారులు విచారించినట్టు సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ''ఫోన్ ట్యాపింగ్ కేసులో ఉదయం 11 గంటలకు కేటీఆర్ విచారణకు వచ్చారు. కేసుకు సంబంధించిన కీలక అంశాలను రాబట్టడంతో పాటు రికార్డులో ఉన్న సాక్ష్యాధారాలతో వాటిని విశ్లేషిస్తున్నాం. సాక్షులు ఎవరినీ సంప్రదించవద్దని, ప్రభావితం చేయొద్దని సూచించాం. అవసరమైతే మళ్లీ విచారణకు రావాల్సి ఉంటుందని తెలిపాం. క్రైమ్ నంబర్ 243/2024కి సంబంధించి మాత్రమే ఇవాళ కేటీఆర్ విచారణ జరిగింది. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, ప్రముఖులతో సహా వేలాది మంది పౌరుల ఫోన్లను అనధికారికంగా, చట్టవిరుద్ధంగా ఇంటర్‌సెప్షన్ (ట్యాపింగ్), నిఘా పెట్టారనే విస్తృత ఆరోపణలకు సంబంధించిన కేసు ఇది. ఫోన్ ట్యాపింగ్ కేవలం భద్రతా కారణాల దృష్ట్యా మాత్రమే జరిగిందని, ఇందులో




ఎలాంటి చట్టవ్యతిరేకత లేదని కొన్ని మీడియా వర్గాలు నిరాధారమైన, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. సిట్‌కు ఇటువంటి తప్పుడు కథనాలతో సంబంధం లేదు. ఈ దర్యాప్తు పూర్తిగా చట్టప్రకారం, నిష్పక్షపాతంగా వృత్తిపరమైన ప్రమాణాలతో జరుగుతోంది. ధ్రువీకరించని, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేయవద్దని ప్రజలను కోరుతున్నాం. చట్టబద్ధమైన, అధికారిక మార్గాల ద్వారా వెల్లడించిన వాస్తవాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం'' అని సజ్జనార్ తెలిపారు.

*** ప్రవీణ్‌కుమార్‌కు సీపీ సజ్జనార్ నోటీసులు**

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సీపీ సజ్జనార్ లీగల్ నోటీసులు ఇచ్చారు. తనపై చేసిన ఆరోపణలకు రెండ్రోజుల్లో ఆధారాలు ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. సీపీ సజ్జనార్‌పై ఏడు క్రిమినల్ కేసులు ఉన్నాయని ప్రవీణ్ కుమార్ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

## తెలుగు విశ్వవిద్యాలయంలో దూరవిద్య ప్రవేశాలు


హైదరాబాద్: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, దూరవిద్యాకేంద్రం, హైదరాబాద్ 2026 విద్యా సంవత్సరానికి పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య పద్మప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆలస్య రుసుము లేకుండా మార్చి 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆలస్య రుసుముతో ఏప్రిల్ 30 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని, కోర్సుల వివరాలు, అర్హతలు, ఫీజు తదితర సమాచారానికి పై వెబ్‌సైట్లను సందర్శించాలన్నారు. మరిన్ని వివరాలకు https://www.pstucet.



org నాంపల్లిలోని దూరవిద్యా కేంద్రం లేదా 73306 23411 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## రూ.కోట్లలో అక్రమాస్తులు..
# జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌పై ఏసీబీ కేసు

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కందడి మధుసూదన్‌రెడ్డికి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆయనకు చెందిన ఆస్తుల వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించారు. మధుసూదన్ రెడ్డి నివాసంతో పాటు బంధువులు, స్నేహితులు, బినామీలకు చెందిన ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. సోదాల్లో దాదాపు రూ.7.83 కోట్ల విలువైన డాక్యుమెంట్లు, ఆస్తులు లభ్యమైనట్లు వెల్లడించారు. మార్కెట్ విలువ డాక్యుమెంట్ విలువ కంటే చాలా రెట్లు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. మూడంతస్తుల ఇండిపెండెంట్ హౌస్, ఓపెన్ ప్లాట్లు, 27 ఎకరాల వ్యవసాయ భూమి, ఎకరం వాణిజ్య భూమి, స్విమ్మింగ్ పూల్‌తో కూడిన ఫామ్‌హౌస్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రూ.9 లక్షల నగదు, 1.2 కిలోల బంగారం ఆభరణాలు, ఇన్నోవా ఫార్చ్యూనర్, వోల్వో, వోక్స్‌వ్యాగన్ టైగన్ GT ప్లస్ కార్లు ఉన్నట్లు వెల్లడించారు. ఏఆర్‌కే స్పిరిట్స్ పేరుతో లిక్కర్ వ్యాపారంలో దాదాపు రూ.80 లక్షలు పెట్టుబడి పెట్టారని తేల్చారు. అతని భార్య, పిల్లల పేర్లతో రెండు షెల్ కంపెనీలను స్థాపించినట్టు ఏసీబీ గుర్తించింది. అదనపు





ఆస్తుల ధ్రువీకరణ, తదుపరి విచారణ కొనసాగుతోందన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు కానీ, వాట్సప్ 9440446106 ద్వారా ఫిర్యాదు చేయొచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచతామని ఏసీబీ అధికారులు తెలిపారు.

## ఇవాళ్టి విచారణలో నేను తప్ప
# ఏ 'రావు' లేరు: కేటీఆర్

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కాలక్షేప కథాచిత్రాలు నడుపుతున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ ముగిసిన అనంతరం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ''సిట్ విచారణకు పూర్తిగా సహకరించాను. ఎందుకు లీకులు ఇస్తున్నారని సిట్ అధికారులను ప్రశ్నించాను. ఈ ప్రభుత్వం లీకు వీరుల ప్రభుత్వం. కేవలం లీకుల మీద నడిచే ప్రభుత్వం. హీరోయిన్ల పేరుతో దుష్ప్రచారం చేశారు.. అది నిజమేనా అని సిట్‌ను



అడిగా. మేం అలాంటి వార్తలు మీడియాకు చెప్పలేదని సిట్ అధికారులు చెప్పారు. అడ్డగోలు లీకులను నమ్మి తప్పుడు వార్తలు ఇవ్వొద్దని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నా. మాకు కూడా కుటుంబాలు ఉన్నాయని మీడియాకు నా విజ్ఞప్తి. ఇప్పుడు మా ఫోన్లు ట్యాప్ కావటం లేదా అని సిట్‌ను అడిగాను. మీకు ఏ నటులు ఫిర్యాదు చేశారని సిట్‌ను ప్రశ్నించా. నా ప్రశ్నలకు సిట్ అధికారులు నీళ్లు నమిలారు. ఏవో కొన్ని పేర్లు చెప్పి.. వాళ్లు తెలుసా అని అడిగారు. మమ్మల్ని విచారించడంపై లీకులు వండి మీడియాకు ఇస్తారు. ఈరోజు నన్ను ఎవరితోనూ కలిపి విచారించలేదు. ఇవాళ్టి విచారణలో నేను తప్ప ఏ 'రావూ' లేరు. మరోసారి విచారణకు పిలుస్తామంటే.. వస్తానని చెప్పాను'' అని కేటీఆర్ తెలిపారు.

## సింగరేణిలో సోలార్ పవర్ కుంభకోణం: మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి బంధువు భూ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టామని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆధారాలతో సహా బయటపెట్టేసరికి ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా అయ్యిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుంభకోణం ఎలా బయటకు వచ్చిందని వారంతా తలలు పట్టుకుంటున్నారని తెలిపారు. రెండేళ్లు దాటినా.. ఇంకా లీక్ రాజకీయాలే చేస్తారా? అని విమర్శించారు. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు ప్రజలు చరమగీతం పాడతారని వ్యాఖ్యానించారు. ''సింగరేణిలో 107 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌లో పెద్ద కుంభకోణం జరిగింది.




ఎంఎస్ఎంఈలు పాల్గొనకూడదని మూడింటికి కలిపి ఒకేసారి టెండర్లు పిలిచారు. సోలార్ పవర్ టెండర్ అనుమతులు కఠినం చేశారు. ప్రభుత్వం అనుకున్న వారికి టెండర్లు కట్టబెట్టేందుకు నిబంధనలు మార్చారు. దేశ వ్యాప్తంగా ఒక మెగావాట్ సోలార్ పవర్ ఉత్పత్తికి రూ.3కోట్లు అవుతుంది. రాష్ట్రంలో మాత్రం ఒక మెగావాట్ సోలార్ ఉత్పత్తికి రూ.5.04 కోట్లు ఇచ్చారు. అదనంగా సింగరేణి భూములు కూడా ఇచ్చారు. సింగరేణిలో సోలార్ పవర్ ఉత్పత్తికి రూ.214 కోట్లు అదనంగా చెల్లించారు. సింగరేణిలో మరో సోలార్ పవర్‌ప్లాంట్‌లోనూ స్కామ్ చేశారు. ఇంకో చోట 1 మె.వా సోలార్ ఉత్పత్తికి రూ.7కోట్లు కట్టబెట్టారు. బొగ్గు కుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిన తర్వాతే కిషన్‌రెడ్డి సమీక్ష చేస్తున్నారు. సింగరేణిలో ఎక్స్‌ప్లోజివ్ కుంభకోణం కూడా జరిగింది. టెండర్లు వేసిన వారితో సీఎం బావమరిది హోటళ్లలో భేటీ అవుతున్నారు. బిడ్లను తెరిచే ప్రక్రియ ఐదారుసార్లు ఎందుకు వాయిదా పడుతోంది'' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేసిన ఘనత బీఆర్ఎస్‌దే

**: మహేశ్‌కుమార్ గౌడ్**

హైదరాబాద్: తాము కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే బీఆర్ఎస్ నేతలు జైల్లో ఉండేవారని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. చట్ట ప్రకారమే కేసుల దర్యాప్తు ఉంటుందని తెలిపారు. గతంలో ప్రతిపక్ష నేతలవే కాదు సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేశారని ఆరోపించారు. హైదరాబాద్ భూములను ప్రైవేట్ వాళ్లకు అక్రమంగా కట్టబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్లు మాట్లాడాలంటే భయపడేవాళ్లమని వ్యాఖ్యానించారు. సింగరేణిలో



అక్రమాలు ఎప్పుడు జరిగాయో తేటతెల్లం అవుతుందన్నారు. ''నక్సల్స్ వంకతో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని అధికారులు చెప్పారు. నటులు, వ్యాపారులు ఏమైనా తీవ్రవాదులా.. ఎందుకు ట్యాప్ చేశారు. కవిత బయటపెట్టిన వాటికి ఆధారాలు ఇవ్వాలని కోరుతున్నా. 547 మంది ఫోన్లను ట్యాప్ చేశారని అధికారులు చెబుతున్నారు'' అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

*** బీఆర్ఎస్‌పై దయాకర్ తీవ్ర విమర్శలు**

జైలుకు వెళ్లాలని బీఆర్ఎస్ నేతలకు బాగా ఉబలాటంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. ''తెలంగాణలో ఎన్నికలంటే డబ్బులు, ప్రలోభాలు ఉండాలనే విధంగా బీఆర్ఎస్ తయారు చేసింది. మీరు చేసిన పాపాలు, తప్పిదాలపై మరో ఐదేళ్లు విచారణ చేసినా సమయం సరిపోదు. డ్రోన్ కేసులో రేవంత్‌రెడ్డిని జైలుకు పంపారు. ప్రొఫెసర్ కొదండరామ్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి అరెస్ట్ చేశారు. మేమెప్పుడూ రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడలేదు. సిట్ అధికారులు, పోలీసులను కేటీఆర్ బెదిరిస్తున్నారు. అనైతిక రాజకీయాలు చేస్తున్నారు'' అని విమర్శించారు.

*** కేటీఆర్, హరీశ్‌పై బల్మూరి వెంకట్ ఫిర్యాదు**

మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ సందర్భంగా పోలీసు అధికారులను వారిద్దరు బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



## జనగామలో...
# మంత్రి సీతక్క పర్యటనలో ఉద్రిక్తత

జనగామ: జనగామలో పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పెంబర్తి క్రాస్ వద్ద చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణలో ఇరు పార్టీల శ్రేణులు పాల్గొన్నారు. కొబ్బరికాయ కొట్టేందుకు బీఆర్ఎస్ నాయకులను ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి ఆహ్వానించారు. ఇది బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం కాదని కాంగ్రెస్ నేతలు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. పల్లా గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. రెండు పార్టీల శ్రేణులను పోలీసులు చెదరగొట్టారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. సీరియల్‌లా సిట్ విచారణ: బండి


కరీంనగర్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ సీరియల్‌లా కొనసాగుతోందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. దొంగే దొంగ అన్నట్లు కేటీఆర్ వ్యవహారం ఉందన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలాడుతోందని విమర్శించారు. ''కేటీఆర్ సిరిసిల్ల కేంద్రంగా అక్రమంగా ఫోన్లు ట్యాప్ చేయించారు. ఆయన చేసిన దారుణాలతో కొన్ని కుటుంబాలు మునిగాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి అరెస్ట్‌లు జరగవు. కేసీఆర్ కుటుంబసభ్యులను అరెస్ట్ చేసే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదు. దేశభద్రత కోసం జరిగే ట్యాపింగ్‌కు.. తెలంగాణలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధమే లేదు. మావోయిస్టుల పేరుతో హీరోయిన్లు, వ్యాపారులు, రాజకీయ



నేతలు, జడ్జీల ఫోన్లు ట్యాప్ చేశారు. సిట్‌లో మంచి అధికారులు ఉన్నారు.. కానీ ప్రభుత్వం వారికి స్వేచ్ఛను ఇవ్వడం లేదు. ఈ కేసులో ఒక్క రాజకీయ నేతనైనా అరెస్ట్ చేశారా? మా ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే కేసీఆర్ కుటుంబ సభ్యులపై చర్యలు చేపట్టేవాళ్లం. తప్పు చేసిన నేతలు, అధికారులను అరెస్ట్ చేయాలి'' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# WHO నుంచి వైదొలిగిన అమెరికా.. రూ.2వేల కోట్లు బకాయిపడిన అగ్రరాజ్యం

వాషింగ్టన్: అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ అధికారికంగా వైదొలిగింది. కొవిడ్ మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలుచేయడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం తెలిపింది. ఇకపై డబ్ల్యూహెచ్‌వోకు అమెరికా నుంచి వచ్చే అన్నిరకాల నిధులు నిలిపివేస్తున్నామని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్నదాని అన్ని కార్యాలయాల నుంచి యూఎస్ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు వెల్లడించింది. ఈ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా వైదొలుగుతున్నట్లు తెలిపింది. ఇకనుంచి పరిమిత పరిధి మేరకు డబ్ల్యూహెచ్‌వోతో కలిసి పనిచేయనున్నట్లు యూఎస్ ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలు సందర్భాల్లో ఆ సంస్థ నుంచి వైదొలుగుతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా



అగ్రరాజ్యం తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. అయితే డబ్ల్యూహెచ్‌వో నుంచి అగ్రరాజ్యం వైదొలిగే సమయానికి అమెరికా దానికి 260 మిలియన్ డాలర్ల (రూ.2,382 కోట్లు) బకాయిలను చెల్లించాల్సి ఉందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక వెల్లడించింది. ఈ విషయంపై డబ్ల్యూహెచ్‌వో అధికారులు మాట్లాడుతూ.. సంస్థ నుంచి వైదొలుగుతున్నట్లు అమెరికా వెల్లడించగానే సరిపోదని.. సంస్థకు బకాయిపడిన 260 మిలియన్ డాలర్లను చెల్లించేవరకు డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ ఉపసంహరణ పూర్తి కాదన్నారు. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెల్లించాల్సిన బకాయిలపై అమెరికా అధికారిక వర్గాలు స్పందిస్తూ.. సంస్థ నుంచి వైదొలగడానికి ముందు బకాయిలను పూర్తిగా చెల్లించాలనే చట్టబద్ధమైన నియమమేమీ లేదన్నారు.




## దేశవ్యాప్తంగా 717 స్లాట్‌లు
# ఖాళీ చేసిన ఇండిగో

దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో.. తమ కార్యకలాపాలకు సంబంధించి కీలక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా ఆయా ఎయిర్‌పోర్టుల్లో ఇండిగో విమానాల రాకపోకల కోసం కేటాయించే స్లాట్‌లలో 717 ఖాళీ చేసింది. ఇందులో మెట్రో నగరాలైన దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ ఎయిర్‌పోర్టుల నుంచే 364 ఉన్నాయి. వీటిల్లో ఎక్కువ భాగం హైదరాబాద్, బెంగళూరు నగరాల్లోనే ఉన్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. ఏదైనా ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్, ల్యాండింగ్ కోసం సంబంధిత విమానయాన సంస్థకు కేటాయించే నిర్దిష్టమైన వ్యవధినే స్లాట్స్‌గా వ్యవహరిస్తారు. ఇలా ఇచ్చిన సమయంలోనే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అయితే, జనవరి నుంచి మార్చి మధ్య కాలంలో ఉండే స్లాట్‌లనే ప్రస్తుతం ఖాళీ చేసుకోగా.. మార్చిలోనే అత్యధికంగా 361 స్లాట్‌లు వెకేట్ చేసినట్లు తెలిసింది. ఖాళీ అయిన ఈ స్లాట్స్‌ని ఇతర విమానయాన సంస్థలకు కేటాయించే అవకాశం కలుగుతుంది. డిసెంబరు తొలివారంలో వేల సంఖ్యలో ఇండిగో సర్వీసుల రద్దైన విషయం తెలిసిందే. దీంతో చర్యలు చేపట్టిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వింటర్ షెడ్యూల్‌లో 10 శాతం కోత విధించింది. దీంతో ఇండిగో కార్యకలాపాలు కుదుటపడినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

# కాంగ్రెస్ కీలక భేటీకి థరూర్ డుమ్మా... మోదీ కోసం కేరళలోనే!


కేరళలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం ప్రధాన పార్టీలు తమ వ్యూహాలు రచించే పనిలో నిమగ్నమయ్యాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ దిల్లీలో కీలక వ్యూహాత్మక సమావేశం నిర్వహించగా.. దీనికి సీనియర్ నేత శశిథరూర్ హాజరుకాలేదు. ఆయన నియోజకవర్గం తిరువనంతపురంలో ప్రధాని మోదీ పర్యటిస్తున్న సమయంలో



ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ప్రధాని పర్యటన వేళ ఆయన కేరళలోనే ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్‌లో సీనియర్ నేత, నాలుగుసార్లు ఎంపీగా ఉన్న థరూర్.. ఇటీవల పలు సందర్భాల్లో ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించడం ఆ పార్టీని ఇబ్బందికి గురిచేస్తోంది. దీంతో రాష్ట్ర నాయకులు కూడా పార్టీ వ్యవహారాల్లో ఆయన్ను పక్కన పెడుతున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల కొచ్చిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాహుల్ గాంధీ తనతో సరిగా వ్యవహరించకపోవడంపై థరూర్ తీవ్ర కలత చెందినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఆయన అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఎన్నికలకు సంబంధించి కీలక భేటీకి థరూర్ దూరంగా ఉన్నారనే వార్తలు వచ్చాయి. ఈ పరిణామాలపై ఆయన కార్యాలయం స్పందిస్తూ.. కొలికోడ్‌లో జరుగుతున్న లిటరేచర్ ఫెస్ట్‌లో పాల్గొనేందుకే థరూర్ రాష్ట్రంలో ఉన్నారని తెలిపింది.

# భారీ వర్షంలోనే.. సైనికుల రిపబ్లిక్ డే రిహార్సల్స్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా దిల్లీలో పరేడ్ కోసం త్రివిధ దళాలు సిద్ధమవుతున్నాయి. ఇందుకోసం కర్తవ్యపథ్‌లో భారీ సన్నాహకాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉరుములతో కూడిన వర్షం కురుస్తున్నప్పటికీ సైన్యం మాత్రం కవాతును కొనసాగించింది. తడిసిన యూనిఫాం, బూట్లతోనే సైనిక బృందాలు సాధన చేయడం గమనార్హం. దిల్లీలో జనవరి 26న జరిగే పరేడ్ కోసం ఆయా విభాగాలు సన్నాహక ప్రదర్శన నిర్వహించాయి. ఈ క్రమంలో వర్షం కారణంగా ఆ మార్గం జారుడుగా మారినప్పటికీ.. సైనిక బృందాలు కవాతును ఫుల్ జోష్‌తో కొనసాగించాయి. గుర్రాలు, ట్యాంకర్లు సహా ఆయా బృందాలు వర్షాన్ని లెక్కచేయకుండా ముందుకు సాగాయి. ఇలా వివిధ ఆర్మీ కంటింజెంట్లు కవాతు చేస్తుండగా.. ఆ ప్రాంతమంతా దేశభక్తి గీతాలతో మారుమోగిపోయింది.



**పరేడ్‌లో ఈయూ కంటింజెంట్..!**

ఈసారి గణతంత్ర దినోత్సవాలకు ఐరోపా సమాఖ్య (ఈయూ) నేతలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి సైనిక బృందాలు కవాతులో పాల్గొననున్నాయి. అనేక దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లతో విరుచుకుపడుతున్న వేళ.. ఐరోపా నేతల భారత పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## గూగుల్ మ్యాప్ చూస్తూ బైక్ ప్రయాణం..
# బావిలో పడి!


లఖ్‌నవూ: గూగుల్ మ్యాప్ చూస్తూ బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడికి ఊహించని పరిణామం ఎదురైంది. చీకటిలో వెళ్తున్న అతడు.. ఓ బావిలో పడిపోయాడు. సాయం కోసం ఆర్తనాదాలు చేస్తున్న అతడిని.. గస్తీలో ఉన్న పోలీసులు గుర్తించి రక్షించారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. లఖ్‌నవూ శివారులోని నాగ్రామ్ పోలీసులు అర్ధరాత్రి గస్తీ నిర్వహిస్తున్న సమయంలో.. రోడ్డుపక్కన ఓ బైక్ పడిపోయి ఉండటాన్ని గమనించారు. సమీపంలోని బావి నుంచి అరుపులు విని.. టార్చ్ లైట్లు వేసి చూశారు. బావిలో యువకుడిని చూసి.. వెంటనే



రక్షణ చర్యలు చేపట్టారు. తమవద్ద ఉన్న రుమాళ్లనే తాడులా చేసి బావిలోకి విడిచారు. అతడికి సూచనలు చేస్తూ సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అతడిని లఖ్‌నవూకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. రాయ్‌బరేలీకి చెందిన రితేశ్ జైస్వాల్.. లఖ్‌నవూలోని అర్జున్‌గంజ్‌లో ఉంటున్నాడు. తన స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరిన అతడు.. కరోరా నాగ్రామ్ మార్గంలో గూగుల్ మ్యాప్‌ను చూసుకుంటూ వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఓ చోట పెద్ద మలుపు రావడంతో.. ఎదురుగా ఉన్న బావి గోడను ఢీకొట్టాడు. బైక్ పక్కన పడిపోగా.. అతడు నేరుగా బావిలో పడిపోయినట్లు పోలీసులు వెల్లడించారు.

# దిల్లీ ఎయిర్‌పోర్టులో 'మానవ అస్థిపంజరం' కలకలం

దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మానవ అస్థిపంజరం కలకలం సృష్టించింది. బ్యాగేజీ తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బంది.. ఓ బ్యాగులో అస్థిపంజరం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ ఏజెన్సీ, దిల్లీ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, అది వైద్య విద్యలో శిక్షణ కోసం ఉపయోగించే నమూనా అస్థిపంజరం అని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. దిల్లీ ఎయిర్‌పోర్టులో టెర్మినల్ 3 నుంచి వెళ్తున్న ఓ వైద్య విద్యార్థి బ్యాగులో ఈ అస్థిపంజరం గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే, అది డెమో అస్థిపంజరమని, సాధారణంగా వీటిని మెడికల్ కాలేజీల్లో ఉపయోగిస్తారని చెప్పారు. ప్రస్తుతం




ఈ కేసులో ఎటువంటి నేరపూరిత కోణం కనిపించలేదని, అయినప్పటికీ అనుమానాలు తొలగించేందుకు గాను దానిని ఫోరెన్సిక్ పరీక్షకు పంపించామన్నారు.




# పాఠశాలలకు బాంబు బెదిరింపులు..!

గణతంత్ర దినోత్సవానికి ముందు.. పాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడం కలకలం సృష్టిస్తోంది నోయిడాలోని శివనాడార్ స్కూల్‌తో సహా అహ్మదాబాద్‌లోని పలు పాఠశాలలకు ఈ బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు తనిఖీలు ప్రారంభించారు. అహ్మదాబాద్‌లో పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే బాంబు స్క్వాడ్ సిబ్బందితో ఆయా స్కూళ్లకు వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఇటు నోయిడా స్కూల్‌కి కూడా బెదిరింపు మెయిల్ అందిన వెంటనే యాజమాన్యం అప్రమత్తమైంది. విద్యార్థులను పాఠశాల నుంచి బయటకు పంపించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ప్రారంభించాయి. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని.. ఇప్పటివరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని పోలీసులు తెలిపారు. మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

## మెడికల్ సీటు..
# 'దివ్యాంగుల కోటా' కోసం పాదం నరుక్కున్న విద్యార్థి!

డాక్టర్ కావాలని కలలు కనే విద్యార్థులు.. వాటిని సాకారం చేసుకునేందుకు కృషి, పట్టుదలతో ప్రయత్నిస్తారు. కానీ, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ విద్యార్థి మాత్రం వక్రమార్గాన్ని ఎంచుకున్నాడు. రెండు సార్లు నీట్ ప్రవేశ పరీక్ష రాసి విఫలమైన అతడు.. దివ్యాంగుల కోటాలో తేలికగా సీటు పొందవచ్చని భావించి తీవ్ర చర్యకు దిగాడు. ఇందుకోసం తన పాదాన్నే నరుక్కున్నాడు. చివరకు అతడి ప్రయత్నం బెడిసికొట్టడంతో పోలీసు కేసు ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని జౌన్‌పుర్‌కు చెందిన సూరజ్ భాస్కర్ (20) ఇటీవల తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి పారిపోయారని, పాదం తెగిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడని అతడి సోదరుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



దర్యాప్తు చేపట్టిన పోలీసులకు.. సూరజ్ ఇచ్చిన వాంగ్మూలంలో అనేక లోపాలు కనిపించాయి. అతడి ఫోన్‌ను పరిశీలించగా.. అందులో ఓ మహిళ నంబర్ తొలగించి ఉండటం మరిన్ని అనుమానాలకు తావిచ్చింది. అతడి డైరీలోనూ "2026లో నేను డాక్టర్ అవుతాను" అని రాసి ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు కొనసాగించిన అధికారులకు షాకింగ్ విషయం తెలిసింది. వైద్య విద్య ప్రవేశ పరీక్షను రెండు సార్లు రాసిన సూరజ్.. అర్హత సాధించలేకపోయాడు. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనై ఎలాగైనా సీటు పొందాలని భావించాడు. దివ్యాంగుల కోటాలో తేలికగా సీటు సాధించవచ్చని అనుకున్నాడు. ఇందుకోసం ఓ పాదాన్ని తొలగించుకున్నాడు. ప్రమాదంలో ఇదంతా జరిగిందని నమ్మించేందుకు.. గుర్తుతెలియని దుండగులు దాడి చేశారనే కట్టుకథ చెప్పినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో అతడిపై ఏయే సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలనే దానిపై న్యాయ సలహా తీసుకుంటున్నట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం అతడు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# బంగ్లాలో అత్యంత దారుణ పరిస్థితులు.. యూనస్‌పై మండిపడ్డ షేక్ హసీనా

బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహ్మద్ యూనస్‌పై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన దేశాన్ని అరాచకంలోకి నెట్టివేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ దేశంలో పరిస్థితులు అత్యంత దారుణంగా మారాయని అన్నారు. దక్షిణాసియా ఫారెన్ కరస్పాండెంట్స్ క్లబ్ దిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ఒకప్పుడు శాంతియుత దేశంగా ఉన్న బంగ్లాదేశ్.. ఇప్పుడు తీవ్ర హింస, భయం, విధ్వంసాన్ని ఎదుర్కొంటోందన్నారు. "బంగ్లాదేశ్‌లో గతేడాది ఆగస్టులో జరిగిన కుట్ర తర్వాత దేశం భయాందోళనలకు గురైంది. ఎక్కడ చూసినా అణచివేత. స్వేచ్ఛ కనుమరుగైంది. సంస్థలు బలహీనపడ్డాయి. మతతత్వ శక్తులు రెచ్చిపోతున్నాయి. మహిళలపై హింస, లైంగిక వేధింపులు విపరీతంగా పెరిగిపోయాయి. దేశం భయంతో నిండిపోయింది. బంగ్లాదేశ్ నేడు రక్తంతో తడిసిన ప్రాంతంగా మారింది. ఇటువంటి సంక్షోభ సమయంలో రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి, హింసాత్మక పాలనకు ముగింపు పలికేందుకు పోరాటం చేయాలి" అని షేక్ హసీనా పిలుపునిచ్చారు.

# సినిమా

## అందరూ అక్కడికి వెళ్లాల్సిందే



ప్రముఖ నటి రేణు దేశాయ్ ఇటీవల కుక్కల అంశంపై చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తన మాటలను తప్పుగా అర్థం చేసుకుని ట్రోల్ చేస్తున్న తీరుపై తాజాగా ఆమె మరోసారి స్పందించారు. సుదీర్ఘంగా 13 నిమిషాల పాటు మాట్లాడిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. గత ప్రెస్‌మీట్ సందర్భంగా ఏమి చెప్పాలనుకున్నారో, ఇప్పుడు ఎందుకు వివాదం రేగిందో స్పష్టంగా వివరించే ప్రయత్నం చేశారు. తాను సుమారు 30 నిమిషాల పాటు మాట్లాడితే, అందులో నుంచి కొందరు వారికి నచ్చిన చిన్న చిన్న క్లిప్పింగ్స్‌ను కట్ చేసి.. వేరే అర్థం వచ్చేలా వైరల్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యల ఉద్దేశాన్ని వక్రీకరించడం వల్లే ఈ రాద్ధాంతం ఏర్పడిందన్నారు. అన్ని కుక్కలను చంపేయాలని తాను ఎక్కడా చెప్పలేదన్నారు. కుక్కలు, పిల్లులు, కోతులు మాత్రమే కాదు.. మనుషుల జీవితమూ శాశ్వతం కాదన్నారు. ప్రభాస్ నటించిన కల్కి సినిమా చూశారా? అదే కలియుగం.. ఎలాగైనా అందరం అక్కడికే వెళ్లాల్సిందేనని, కాబట్టి ప్రశాంతంగా, మంచిగా ఉండాలని సూచించారు. ఈ తాజా వ్యాఖ్యల వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.

## అమ్మ నో.. నాన్న ఓకే



బాలీవుడ్ నటి సయానీ గుప్తా గురించి పరిచయం లేదు. సినిమాలు, వెబ్ సిరీస్‌లలో విలక్షణమైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. అమ్మడు కేవలం నటి మాత్రమే కాదు. అవసరమైతే గొంతు సవరించి గాయనిగా మారిపోతుంది. ఇండస్ట్రీకి రాక ముందే మ్యూజిక్, డ్యాన్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. థియేటర్ ఆర్టిస్ట్‌గా ప్రారంభమై సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. సెకండ్ మ్యారేజ్ డాట్ కామ్స్‌తో లాంచ్ అయిన బ్యూటీ మార్గరీటా విత్ ఎ స్ట్రా సినిమాలో తన పాత్రతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అటుపై ఫ్యాన్ సినిమాలో షారుక్ ఖాన్‌తో కలిసి తెరను పంచుకుంది. అక్షయ్ కుమార్, ఆయుష్మాన్ ఖురానా రణబీర్ కపూర్ లాంటి స్టార్లతోనూ కలిసి పనిచేసింది. సినిమాల్ని మించి ఓటీటీలతో వరల్డ్ అంతా ఫేమస్ అయింది. వీటన్నింటిని మించి వ్యక్తిగతంగా అమ్మడు నెట్టింట వైరల్ అవుతుంటుంది. తరచూ మహిళల హక్కులు, సామాజిక అంశాల గురించి సోషల్ మీడియాలో గళాన్ని వినిపిస్తుంది. అలాంటి నటి సినిమాల్లోకి వచ్చే క్రమంలో తల్లి నుంచి చాలా ఇబ్బందులే ఎదుర్కొందట. తనని ఇబ్బంది పెట్టి వెళ్తానంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించిందట. తండ్రి సహకారంతోనే ఫిల్మ్ ఇనిస్ట్యూట్ లో

## రెడ్ డ్రెస్‌లో..




లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ చిత్రంతో అరంగేట్రం చేసిన భామ ఈషా రెబ్బా. హీరోయిన్‌గా సినిమాలు చేయక ముందు కొన్ని చిన్న చిన్న పాత్రల్లో నటించింది. హీరోయిన్‌గా బ్యాక్‌టు బ్యాక్ సినిమాలు చేసిన ఈ చిన్నది అనుకున్నంత గుర్తింపు రాకపోవడంతో ఆ తర్వాత సెకండ్ హీరోయిన్‌గా మారి మెప్పించింది. అరవింద సమేత సినిమాలో హీరోయిన్‌చెల్లిగా నటించింది. అదే విధంగా మోస్ట్ ఎలిజిబుల్‌బ్యాచిలర్ మూవీలోనూ కనిపించింది. ఇక త్రీ రోజెస్ సిరీస్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. త్రీ రోజెస్ 2 తోనూ మంచి విజయం అందుకుంది. 2021లో ద్విభాషా చిత్రం ఒట్టుతో మలయాళ సినిమా రంగ ప్రవేశం చేసింది. ఈ చిత్రంలో తన పాత్ర కోసం ఆమె విలువిద్య, కిక్‌బాక్సింగ్ నేర్చుకుంది. ఇప్పుడీ తెలుగమ్మాయి ఓం శాంతి శాంతి శాంతి: అనే మూవీతో ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అయింది. ఇందులో తరుణ్‌భాస్కర్‌కు జోడీగా నటించింది. ఈ మూవీ జనవరి 30 థియేటర్లలో రిలీజ్‌కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఫొటోషూట్ నిర్వహించిన ఈషా రెడ్ కలర్ డ్రెస్‌లో దిగిన ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్‌చేసింది. ప్రస్తుతం ఆమె షేర్‌చేసిన ఫొటోలు వైరల్‌గా మారుతున్నాయి.

## ఆదర్శ కుటుంబంలో నారా రోహిత్



అగ్ర తార వెంకటేశ్ కథానాయకుడిగా... త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47'. శ్రీనిధిశెట్టి కథానాయిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాలో మరో కథానాయకుడు నారా రోహిత్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ప్రస్తుతం రోహిత్‌తోపాటు, ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. త్రివిక్రమ్ సినిమాల్లో యువ కథానాయకులు కీలక పాత్రల్లో మెరవడం కొత్త కాదు. నారా రోహిత్ ఎలాంటి పాత్రలో సందడి చేస్తారో చూడాలి. ఈ ఏడాది వేసవిలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'హ్యాపీరాజ్' ఆట



పెళ్లి చేసుకుంటావా? అని అమ్మాయి అడగడమే ఆలస్యం... 'నేనుగనక నిన్ను పెళ్లి చేసుకుంటే ఈ ప్రపంచంలో నేనే హ్యాపీ' అంటూ ఎగిరి గంతేశాడు హ్యాపీరాజ్. కానీ అసలు ఆట ఆ తర్వాతే మొదలైంది. మరి వీరి పెళ్లి ఎలా జరిగిందో తెలియాలంటే 'హ్యాపీరాజ్' చూడాల్సిందే. జీవీ ప్రకాశ్‌కుమార్, శ్రీ గౌరిప్రియ జంటగా తెరకెక్కుతున్న చిత్రమిది. మారియా ఎలాంచెజియన్ దర్శకత్వం వహిస్తున్నారు. జైవర్ధన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు ప్రచార చిత్రాన్ని ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ గురువారం విడుదల చేశారు.

## అపార్థం వల్ల ఎదురైన ఇబ్బందులేంటి?



''అసభ్యతకు తావులేని మంచి కుటుంబ కథా చిత్రం 'హలో ఇట్స్ మీ'. యువతీ యువకులు ఒకరినొకరు అపార్థం చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనేది ఈ సినిమాలో అందంగా చూపిస్తున్నాం'' అన్నారు వరుణ్ సందేశ్. ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కథానాయిక షగ్నశ్రీ వేణున్ స్వయంగా తెరకెక్కిస్తోంది. దర్శన్ మదమంచి మరో హీరో. వీఎస్‌కే సంజీవ్, వి సందీప్, వి సంకీర్త్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ''ప్రతి అమ్మాయి, అబ్బాయికి ఈ సినిమా రిలేట్ అవుతుంది. యూత్ అంతా దీనికి కనెక్ట్ అవుతారు'' అన్నారు కథానాయిక, దర్శకురాలు షగ్నశ్రీ.

## తెలుగు వారి గుండెల్లో నిలిచేలా..'గొల్ల రామవ్వ'

దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పోరాటగాథ 'గొల్ల రామవ్వ'ను దృశ్యరూపంగా తెరపైకి తీసుకొస్తున్నారు దర్శకుడు ముళ్లపూడి వరా. తాళ్లూరి రామేశ్వరి టైటిల్ పాత్ర పోషించిన ఈ వీరగాథను రామ్ విశ్వాస్ హనూర్కర్ రాఘవేంద్రవర్మ నిర్మించారు. ఇది ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో ఈ నెల 25నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. పీవీ నరసింహారావు కుమారుడు పీవీ ప్రభాకర్ రావు, కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

## 'అరుంధతి' స్థాయిలో కానిస్టేబుల్ కనకం 3

ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్ నుంచి రెండు సీజన్లుగా వచ్చిన 'కానిస్టేబుల్ కనకం' సిరీస్ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణని సొంతం చేసుకుంది. వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రధారిగా నటించగా, ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించారు. కోవెలమూడి సత్యసాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. ఘన విజయం సాధించిన ఈ సిరీస్ త్వరలోనే ఓ సినిమాగా ముస్తాబై ప్రేక్షకుల ముందుకు రానుంది. దాంతోపాటు, ఈ సిరీస్‌కు కొనసాగింపుగా 'కానిస్టేబుల్ కనకం కాల్ ఘాట్ 3' పేరుతో మరో చిత్రం రూపొందనుంది. ఈ కొత్త ప్రాజెక్టుల్ని ప్రకటిస్తూ గురువారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రముఖ దర్శకనిర్మాతలు కె.రాఘవేంద్రరావు. సి.అశ్వనీదత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ ''ముప్పయ్యేళ్ల కిందట 'శాంతి నివాసం' ధారావాహికతో ఈటీవీతో నా ప్రయాణం మొదలైంది. నేను అనుకున్నదానికంటే ఎంతో అద్భుతంగా ఎస్.ఎస్.రాజమౌళి ఆ ధారావాహికని తెరకెక్కించాడు. అందుకే ఇప్పుడు దేశంలోనే అగ్ర దర్శకుడిగా కొనసాగుతున్నాడు. ఆ ధారావాహికతోపాటు, నేను తీసిన ఎన్నో సినిమాల్లో భాగం పంచుకున్నారు ఈ సిరీస్ నిర్మాతలు సాయిబాబా, హేమంత్'. వాళ్ల అనుభవాన్నంతా మేళవించి, కొత్తతరం దర్శకుడు ప్రశాంత్, ఈటీవీ విన్‌తో కలిసి విజయవంతంగా 'కానిస్టేబుల్ కనకం' సిరీస్ రెండు సీజన్లను రూపొందించారు. ఈటీవీ విన్ కథాసుధలో నేనూ ఇప్పటివరకూ పది కథలు తీశాను. ఈటీవీ విన్ ప్రోత్సాహం ఎంతో ఉత్సాహాన్నిస్తుంది. 'బాహుబలి' సినిమాలకీ కొనసాగింపుగా మూడో భాగం తీయాలని అడుగుతున్నారంతా. 'కానిస్టేబుల్ కనకం' సినిమాలు కూడా 'బాహుబలి' చిత్రాల్లాగా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా'' అన్నారు. నిర్మాత సి.అశ్వనీదత్ మాట్లాడుతూ ''కానిస్టేబుల్ కనకం విజయపరంపర ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా'' అన్నారు. వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ ''నటనకు ప్రాధాన్యమున్న ఇలాంటి పాత్రలే చేయండంటూ కోరుతున్నారు చాలా మంది. ఇలాంటి అరుదైన అవకాశాన్ని నాకు ఇచ్చిన నిర్మాతలు, ఈటీవీ విన్, దర్శకుడు ప్రశాంత్‌కి కృతజ్ఞతలు. ఈ సిరీస్ ప్రయాణాన్ని ఎంతగానో ఆస్వాదించా. ఓ నటిగా నాకెంతో తృప్తినిచ్చింది. ఛాప్టర్ 3 అందరితోపాటు నన్నూ ఆశ్చర్యపరిచింది. ఆ సినిమా కోసం కిక్‌బాక్సింగ్ నేర్చుకున్నా'' అన్నారు. మూడో భాగంగా రాబోతున్న సినిమా ప్రేక్షకులపై చాలా ప్రభావం చూపిస్తుందన్నారు దర్శకుడు. ఈటీవీ విన్ సాయికృష్ణ మాట్లాడుతూ ''సిరీస్ రెండు సీజన్‌లు అద్భుతమైన విజయాల్ని సాధించాయి.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.